నష్టాల ఊబిలో టమాట రైతులు

- మార్కెట్లో పడిపోయిన ధరలు
- 30 కిలోల బాక్సు రూ. 100 లోపే
- అప్పులే మిగిలాయంటున్న రైతులు





మార్కెట్‌కు తరలించడానికి టామాటాను సిద్ధం చేస్తున్న రైతులు

తనకల్లు: ఎన్నో వ్యయ ప్రయాసాలతో టమాటను సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. మార్కెట్లో ధరలు పడిపోవడంతో పంట కోసం చేసిన అప్పులే మిగిలాయని రైతులు వాపోతున్నారు. సాధారణంగా మార్కెట్‌లో మే నెలలో మంచి ధరలు ఉంటాయని రైతులు ఆశిస్తారు. గత ఏడాది కూడా మే నెలలో టమాట ఒక బాక్సు (30 కిలోలు) రూ. 2 వేలుకు పైగానే పలికింది. దీంతో ఈ ఏడాది కూడా మే నెలలో మంచి ధరలు ఉంటాయని ఆశించిన చాలా మంది రైతులు టమాట పంటను సాగు చేశారు. కాని వారికి నిరాశే ఎదురైంది. ప్రస్తుతం కాయ నాణ్యతను బట్టి బాక్సు రూ. 50 నుంచి రూ 100 లోపు పలుకుతోంది. దీంతో పెట్టుబడి మాట దేవుడు ఎరుగు కనీసం కూలీల ఖర్చు, రవాణా ఖర్చులకు రాకపోవడంతో రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు.

పొలాల్లోనే పంట..

మండల వ్యాప్తంగా దాదాపు 500 ఎకరాలకు పైగానే రైతులు టమాట పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. సాధారణంగా ఇక్కడ పండే టమాటను ఎక్కువగా అన్నమయ్య జిల్లా మదనపల్లి, మొలకలచెరువు, అంగళ్లు, పుంగనూరు, పలమనేరు తదితర మార్కెట్లకు తరలిస్తారు. అయితే అక్కడి మార్కెట్లలో టమాటా ధరలు పతనమవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో 30 కిలోల బాక్సు 100 లోపే పలుకుతోందని రైతులు రామాంజులు, హరి నాయక్, విశ్వనాథ్ తదితరులు తెలిపారు. ఎకరా తోటలో కాయలు కోసేందుకు పది మంది కూలీల అవసరం ఉంటుంది. ఒక్కో కూలీకి రూ. 400 చెల్లించాల్సి ఉంటుంది. పది మందికి రూ. 4 వేలు ఇవ్వాలి. ఇక రోజుకు 50 బాక్సులను రైతు మార్కెట్‌కు తరలిస్తే రూ.1500 కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు టమాటను మార్కెట్‌కు తరలించడానికి రవాణా చార్జీలు అదనంగా పెట్టాలి. ధరలు పతనం, కూలీల ఖర్చు, వెరసి గిట్టుబాటు కాకపోవడంతో కాయలను కోయకుండా తోటలలోనే వదిలేశారు. చాలామంది రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కక అప్పుల పాలవక తప్పడం లేదు.

బాక్సు రూ. 50 మాత్రమే పలికింది..



నేను ఒకటిన్నర ఎకరాలో టమాట పంటను సాగు చేశాను. పంట సాగుకు అన్ని ఖర్చులు కలిపి రూ. 1.5 లక్షలు ఖర్చు పెట్టాను. నిన్న 50 బాక్సులను మొలకలచెరువు మార్కెట్‌కు తీసుకెళ్లా. అక్కడ బాక్సు కేవలం రూ. 50 మాత్రమే పలికింది. దీంతో కూలీల ఖర్చు కూడా రాలేదు. రవాణా ఖర్చులు చేతి నుంచి పెట్టుకోవాల్సి వచ్చింది. వేసవిలో ధరలు బాగా ఉంటాయని ఆశించి పంట సాగు చేశాను. చివరకి పెట్టుబడి కూడా రాలేదు.

– హరినాయక్, రైతు, పెద్దపల్లి, తనకల్లు

రెండు ఎకరాలలో సాగు చేశా



వేసవిలో టమాటకు మంచి గిరాకీ ఉంటుందని తోటి రైతులు చెబితే నేను రెండు ఎకరాలలో రూ. 2 లక్షలు ఖర్చు చేసి టమాట పంట సాగు చేశాను. అయితే మార్కెట్లో ధరలు పడిపోయాయి. 30 కిలలో బాక్సు రూ. వంద పలికితే మేం ఎలా కుటుంబాలను పోషించుకోవాలో అర్థం కావడం లేదు. ఈ ఏడాదంతా టమాట రైతులకు నష్టాలే మిగిలాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– రాజారెడ్డి, రైతు, వద్దు మరవపల్లి, తనకల్లు

క్లుప్తంగా

నీటి తొట్టెలను సద్వినియోగం చేసుకోవాలి



మరవపల్లిలో పశువుల తాగునీటి తొట్టెను ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిమర్రి: పశువులకు తాగునీటిని అందించడానికి నిర్మించిన నీటి తొట్టెలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి రైతులకు సూచించారు. మరవపల్లి గ్రామంలో రూ.35 వేలతో నిర్మించిన నీటి తొట్టెలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కారణంగా పశువుల తాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడకూడదని తాగునీటి తొట్టెలను నిర్మించినట్లు తెలిపారు. కార్యదర్శి నారాయణస్వామి, టీఏ వెంకటకృష్ణ, ఎఫ్ఏ మనోహర్, ఎఫ్ఏ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా క్రాంతికుమార్



పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా క్రాంతికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన కమిషనర్ పేర్కొన్నారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై దృష్టి సారిస్తానని తెలియజేశారు. కమిషనర్‌కు సిబ్బంది, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

భూ పరిశీలన

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ కదిరి కొండ సమీపంలో ప్రభుత్వ భూమిని తహశీల్దార్ మురళీకృష్ణ శనివారం పరిశీలించారు. అక్కడ భూమని చదును చేస్తున్న ప్రైవేటు వ్యక్తులను విచారించారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన పట్టా ఉండటంతో చదును చేసుకుంటున్నట్లు ప్రైవేటు వ్యక్తులు తెలియజేశారు. దీంతో పట్టాను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొస్తే రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపుపై సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేశ్వరిదేవి

ధర్మవరం అర్బన్: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని ఎంఈఓలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో చేపట్టిన ఇంటింటా సర్వేను శనివారం ఎంఈఓ రాజేశ్వరిదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. ఇందిరమ్మకాలనీలో ఒక విద్యార్థిని గుర్తించామని తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్వేలో భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు సరస్వతి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సేవలో రైల్వే ప్రిన్సిపల్ సెక్రటరీ

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో స్వామిని దక్షిణ మధ్య రైల్వే ఎస్‌సీఆర్‌ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ కమీషనర్ ఆరోమా సింగ్ ఠాకూర్ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని దుర్గాదేవి, పాపనాశేశ్వర, రఘునాథస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించి ఆనందం వ్యక్తం చేసారు. అనంతరం దేవదాయ శాఖ అధికారులు ఆమెను ఘనంగా సత్కరించారు.

హెల్త్ సూపర్‌వైజర్ అదృశ్యం

కదిరి టౌన్: పట్నం ప్రభుత్వాస్పత్రిలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న విజయశేఖర్ అదృశ్యమయ్యాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు..విజయశేఖర్ పట్టణంలోని వాణీస్ట్రీట్‌లో నివాసం ఉంటున్నాడు. విజయ్‌శేఖర్ భారీ అప్పులు చేయడంతో ఆ డబ్బంతా ఏం చేశావని భార్య వనజ ఇటీవల అతడిని నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన అతడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం వనజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



తనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తనకల్లు: సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని సీడీపీఓ జయంతి అన్నారు. రాచువారిపల్లి సమీపంలో ఉన్న వెలుగు కార్యాలయంలో శనివారం కిశోరి వికాసం- వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవడం వల్ల కుటుంబంతో పాటు సమాజంలోనూ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికట్టడం, కిశోరి వికాసం కమిటీలు, ఆరోగ్యం- పౌష్టికాహారం, లింగ వివక్షను అరికట్టడం, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, మోసాలు, బాలికలకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, ఆత్మ రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిమర్రి: పిన్నదరి గ్రామ శివారులో శనివారం పేకాటశిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,040 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని, సోమవారం వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తాడిమర్రిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శివకుమారి



పోలీస్ కార్యాలయంలో శుభ్రం చేస్తున్న ఎస్పీ రత్న, సిబ్బంది



కుమ్మరవాండ్లపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

తాడిమర్రి: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌డీఓ శివకుమారి గ్రామస్తులకు సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ పాఠశాలలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరుచేసి రెండు బుట్టల్లో వేయాలన్నారు. ఎంపీడీఓ వెంకట రంగారావు, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌శేఖర్‌నాయుడు, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, కార్యదర్శి రిజ్వానా బేగం తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: రోగాలు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం. లిఖిత సూచించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో కంపచెట్లు, చెత్తాచెదారం తొలగించి ఆరోగ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యాధికారి మొక్కలు నాటి నీరు పోశారు. సీహెచ్‌ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్ మహబూబ్‌బాషా, స్టాఫ్‌నర్స్ శిరోమణి, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన, సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తలుపుల: స్థానిక పంచాయతీ కార్యాలయ అవరణలో సెక్రటరీ రమణప్ప అధ్యక్షతన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ నసీమా, అధికారులు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ వెంకట్రాముడు, హోమియో డాక్టర్ లక్ష్మీనర్సయ్య, టోపీ రమణ సెక్రటరీలు అనీల్, హరి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కనగానపల్లి: స్వచ్ఛంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. మండలంలోని తూంచర్ల గ్రామంలో శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం), పంచాయతీ కార్యాలయ భవనాలను ప్రారంభించారు. మొక్కలు, పచ్చదనం పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ బంగి మల్లేసు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిసరాల పరిశుభ్రత-ఆరోగ్యం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర నాయుడు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ అనిల్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి, కదిరి కుంట్లపల్లి పంచాయతీల్లో శనివారం ఎంపీడీఓ పోలప్ప స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కదిరికుంట్లపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి అంజనప్ప హాజరై వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు. సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పోలీస్ అధికారులు, డీపీఓ సిబ్బంది, ఏఆర్ పోలీసులతో కలిసి కార్యాలయం ఆవరణాన్ని శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరిచేరవన్నారు. ప్రతి నెలా మూడో శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్లలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: అధికారులు గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. గ్రామాల్లో తాగునీటి పథకాలకు అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సభ్యులు విద్యుత్ అధికారులను కోరారు. వర్షాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశముందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి జ్యోత్స్న తెలియజేశారు. ఎంఈఓ ప్రసాద్‌మాట్లాడుతూ 9 ఏళ్ల క్రితం మూతపడిన సాతార్లపల్లి ప్రభుత్వ పాఠశాలను వినియోగంలోకి తెస్తామన్నారు. త్వరలోనే సబ్సిడీ విత్తన వేరుశనగకాయలు వస్తాయని ఏఈఓ ఆనంద్ నాయక్ చెప్పారు. మండలానికి 41 పశువుల నీటి తొట్టెలు మంజూరు కాగా ఇప్పటి వరకూ 36 తొట్టెలకు నీటి సరఫరా ఇచ్చినట్లు ఏపీఓ వరప్రసాద్ తెలిపారు. వైస్ ఎంపీపీ రంగన్న, కోఆప్షన్ మెంబర్ మాబుసాహెబ్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో పాటు వక్తలు, పిల్లల తల్లిదండ్రులు

కదిరి: ప్రభుత్వ పాఠశాలలో చదివి 500 మార్కులకు పైగా సాధించిన 'రెడ్డి' సామాజిక వర్గ విద్యార్థులు ప్రశంసా పత్రాలతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. స్థానిక దత్తా ఫంక్షన్ హాల్‌లో శనివారం రిటైర్డ్ ఎంఈఓ బి.వి.శివారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశ్రాంత కలెక్టర్ కడపల వెంకటరమణారెడ్డి, రిటైర్డ్ రిజిస్ట్రార్ రమణారెడ్డి, మరికొందరు రెడ్డి సామాజిక వర్గ ప్రముఖులు హాజరయ్యారు. పేదరికంలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలల్లో చదివి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. వీరంతా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఖాయమన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ.3,500 చొప్పున అందజేశారు. నగదు బహుమతులు అందుకున్న వారిలో జి.శ్రావణ్‌కుమార్‌రెడ్డి, డి.చంద్రిక, టి.పల్లవి, కె.రుచిత, ఆర్.హర్షవర్ధన్‌రెడ్డి, పి.శ్రీదీక్షిత, వై.దినేష్‌కుమార్‌రెడ్డి, వై.హాసిని, పి.కార్తీక్‌రెడ్డి, ఆర్.మనీషా, కె.జాన్విప్రియారెడ్డి, జె.సురేఖ, బి.మధులత, ఎస్.జాన్ విక్టర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న వజ్రభాస్కరరెడ్డి

గాండ్లపెంట: మండల కేంద్రంలో గంగాభవాని మాత తిరునాలలో భాగంగా శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. చాంద్‌నీ బండి అలంకరించి అమ్మవారి విగ్రహన్ని ప్రత్యేక పూజల అనంతరం స్థానిక గంగాభవానీ ఆలయం నుంచి పుర వీధుల గుండా బాణాసంచా కాల్చుతూ, కోలాటాలు చేస్తూ ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి టెంకాయలు సమర్పించారు. రాత్రి పాటల కచేరీ ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఇక్బాల్, మేకల నరసింహులు, రామాంజులరెడ్డి, మైనుద్దీన్, ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్యానికి తలవంచిన ప్రధాని



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కదిరి టౌన్: అమెరికా ఆధిపత్యానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ తలవంచారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ విమర్శించారు. శనివారం వారు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. రక్షణ రంగం, సైన్యం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, బీజేపీ నాయకులకు ఎలాంటి గౌరవం లేదన్నారు. ఇప్పటికే రక్షణ రంగానికి రూ.7 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించారన్నారు. ఇప్పుడు మరో రూ.50 వేల కోట్లు అదనంగా కేటాయించినట్లు కేంద్రం ప్రకటించిందని, ఏం చేయాలని ఇన్ని కోట్లు రక్షణకు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. అసలు సైన్యం అంటేనే గౌరవం లేని మీరు ఈ కేటాయింపులతో ఏమి చేయాలనుకుంటున్నారని నిలదీశారు. ప్రధాని మోదీ ఉత్తుత్తి మాటలు తప్ప చేతల్లో ఏమీ చూపించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నోరు మెదపడం లేదన్నారు. సీపీఐ నాయకులు సురేంద్రచౌదరి, కదిరప్ప, అంజన్‌బాబు, లియాకత్, పవన్, మధు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇలా.. రాకపోకలు ఎలా?

చింతలపల్లి గ్రామంలో గ్రామ ప్రధాన వీధిలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు వెళ్లడానికి చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంతం అంతా బురదగా మారింది. ఈ బురదలో మహిళలు, వృద్ధులు జారి పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. సమస్యను ఇదివరకే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– ధర్మవరం రూరల్:



ప్రధాన వీధిలో నిల్వ ఉన్న వర్షపునీరు

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: పట్టణాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. 27, 28 వార్డుల్లో రూ.3 కోట్లతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గాంధీనగర్ వద్ద ఏర్పాటు చేసిన 'బటర్‌ఫ్లై ఫొటో షూట్'ను ప్రారంభించారు. ప్రభుత్వ స్థలాలకు కంచె ఏర్పాటుకు భూమి పూజ చేశారు. 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0 ప్రాజెక్టు కింద రూ.29 కోట్లతో నీటి సరఫరా పథకానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు రూ.2.4 కోట్ల విలువైన 39 చెత్త సేకరణ వ్యాన్లు, 12 ట్రాక్టర్లు, మెటీరియల్ రికవరీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక 'ఆపరేషన్ సిందూర్'లో మన సైనికులు వీరోచిత పోరాటం మరువలేనిదన్నారు. భారత సైనికుల ధైర్యమే మన గర్వమన్నారు. వంద పాకిస్తాన్‌లు వచ్చినా ఎదుర్కొనే శక్తి భారత్‌కు ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వార్డు కౌన్సిలర్ దోలా ఓబులమ్మ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశా.. గోవిందా



ఖాద్రీశుని దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

కదిరి టౌన్: వేసవి సెలవులు..అందునా శనివారం కావడంతో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, కర్ణాటక నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరావడంతో కదిరి కిటకిటలాడింది. ఉదయమే స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు ఖాద్రీశా… గోవిందా అంటూ వసంతవల్లభుడిని కీర్తించారు. దీంతో కదిరి పట్టణం నారసింహుడి నామస్మరణతో మార్మోగింది. స్వామి కాపులు తలనీలాలు సమర్పించుకున్నారు. సాయంత్రం వేళ మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్నదానం చేశారు.

నేటి నుంచి బీరలింగేశ్వరుడి జాతర

పావగడ: రాయచెర్లు గ్రామంలో ఆదివారం, సోమవారం బీరలింగేశ్వర స్వామి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ సమితి అధ్యక్షుడు ఆర్ఓ సాంమ సదాశివరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీరలింగేశ్వర స్వామి, రాచెర్లప్ప, ముప్పెల్లప్ప స్వామి నూతన విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాగినెలె మహా సంస్థాన కనక గురు పీఠాధిపతి ఈశ్వరానందపురి మహా స్వామిజీ వస్తారని పేర్కొన్నారు. ఆంధ్రలోని పెనుకొండ, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు చెందిన గుడికట్టు భక్తులు తరలి రావాలని కోరారు.

కదిరిలో భారీ వర్షం

కదిరి టౌన్: పట్టణంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. వలీసాబ్ రోడ్డు, కంచుకోట, అమీన్‌నగర్, అడపాలవీధి, మారుతీనగర్, కోనేరు సర్కిల్, సోమగట్టువీధి, సైదాపురం, జీవిమాను సర్కిల్, చౌక్ బజారు, మార్కెట్ వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. వేమారెడ్డి సర్కిల్ వద్ద కాలువలు సరిగా లేకపోవడంతో వర్షం నీటితో పాటు మురుగునీరు రోడ్డుపై పారింది. దాదాపు గంటసేపు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.